# పానకంలో పాయసం

ప్రాయోజకులు Ph : 22141
డా॥ వి. నరసింహాచారి
దేవి నర్సింగ్ హోం
సిద్దిపేట - 502 103
Dr. V. Narasimhachari
DEVI NURSING HOME
SIDDIPET - 502 103.

"మనం వెళ్తుంది సిన్మాకోయ్, సింగపూర్‌కు కాదు" గంట సేపట్నుంచి అలంకరణలో మునిగిన సుకన్య బుగ్గమీద చిటికేసి గుర్తుచేశాడు శ్రీధర్.

"అబ్బా! ఇప్పుడే పౌడరేసుకున్నాను. చిటికెలో డ్రెస్సు మార్చుకుని వస్తాను. మీరు బయటకి నడవండి" కాటుక కళ్ళు కందిరీగల్లా కదిలాయి.

సెక్రటేరియట్‌లో తనతో పంజేస్తున్న ఏ అమ్మాయి కళ్ళల్లోనూ అంత ఆకర్షణ కనిపించలేదు. మనసు నిండా మల్లెల జల్లు కురిసింది. సొగసు చూడతరమా అంటూ కాళ్ళు కదలడం లేదు. అజంతా శిల్పాల్ని అదేపనిగా చూస్తున్నట్టు కళ్ళు రెప్పవేయడం మరిచాయి.

"మీరిక్కడే ఉంటే మార్నింగ్‌షోకు కాదు కదా మ్యాట్నీ కూడా అందుకోలేం" తుంటరి మొగుడి భుజాల మీద చేతులేసి బయటకు నడిపించింది కొంటె పెళ్ళాం. గది తలుపులు గబుక్కున మూసుకున్నై.

నల్లగొండలో నాలుగు నెలల క్రితం కలుసుకున్న శ్రీధర్ - సుకన్యల మనసులు ముప్పై రోజుల క్రితం ముషీరాబాద్‌లో ముడిపడ్డాయి. ముచ్చటగా కాపురం పెట్టాక మొదటి ఆదివారమది.

చందనం అంచు గులాబీరంగు చీరలో విరబూసిన గులాబీలా తయారైంది సుకన్య. అలవోకగా హాండ్‌బ్యాగందుకుని "జడలో పెట్టండి" అంటూ మల్లె దండ అందించింది. నల్లనాగు పడగ మీద తెల్లని చారలా చోటు చేసుకుంది పూలదండ.

బుర్ర్‌ర్... ఆటో వచ్చి ఇంటి ముందాగింది.

"ఆహా! కలిసొచ్చే అదృష్టానికి నడిచొచ్చే కొడుకు పుట్టాడన్నట్టు - పిలిచినట్టే వచ్చేసిందోయ్ ఆటో" సుకన్య చెయ్యందుకున్నాడు హుషారుగా.

"బాగున్నావురా అబ్బాయ్? బాగున్నావమ్మా?" చేతిలో సూటుకేసుతో శ్రీహరిరావు ప్రవేశించాడు. కొత్త దంపతుల మొహాలు పాత మసిగుడ్డల్లాగయ్యాయి.

"వామ్మో! మా బాబాయి. ముట్టుకుంటే అంటుకునే రకం సుకన్యా. ముందే ఇది హైద్రాబాదు..." స్వర్గానికెళ్తుంటే చారలపిల్లెదురైనట్టు శ్రీధర్ గుండె గుబగుబలాడింది.

"పానకంలో పుడక" చిర్రుబుర్రు. ముక్కుపుడక మూడు వంకర్లు తిరిగింది.

"రండి బాబాయ్, రండి!" ఎదురెళ్ళి సూటుకేసందుకోక తప్పలేదు. శ్రీహరిరావు పెదాల మీద చిరునవ్వు చిందులేసింది.

"అత్తయ్య బాగున్నారా మామయ్యా?"

కోడలు పలకరింపు కొడైకెనాల్ పైరగాలిలాగుంది.

"అంతా బాగున్నారమ్మా! కొత్త కాపురం కదా, ఓసారి చూసెళ్ళానీ... బైదిబై వారం రోజులుంటే శ్రీధరం సిటీ అంతా తిప్పి చూపిస్తాడనీ..."చకచకా బాత్రూంలో దూరాడు.

ముసలాయన చొరవ ముచ్చెమటలు పోయించింది.

"ప్లాన్ పెద్దదేనండోయ్" కాటుక కళ్ళు చేటలైపోయినై.

"చిలకా గోరింకల్లా తిరుగుదామనుకుంటే చిక్కుల్లో పడేశాడే!" బేజారైంది.

కాసేపు గుసగుసలు. మసిగుడ్డ మొహాలు మణిదీపాల్లా వెలిగాయి.

"అమ్మాయి చేతి వంట అమృతమని విన్నార్రా!" తల దువ్వుకుంటున్న శ్రీహరిరావు చిద్విలాసం. "ఇంతకీ ఈరోజేం టిఫినమ్మా?" ఆకలి కేక.

"అది హోటల్ కెళ్ళాక తేల్చేద్దాం బాబాయ్"

భృకుటి ముడిపడిందో క్షణం. వెంటనే తేరుకున్నాడు.

"వెధవ ఆసికాలూ నువ్వూను. ఓరేయ్ నేన్నీ బాబాయిన్రా!"

"ఆసికం కాదు బాబాయ్, నేవంటే నీకెంత ఇదో నాకు తెలీదా? వందల కిలోమీటర్లు దాటొచ్చావు. వంటా, తంటాలంటూ ఇంట్లో కూచుంటే ఏమీ చూడలేం. ఈరోజు ఆదివారం గూడాను. అలా తిరిగొద్దాం పద బాబాయ్..."

మాటలు వింటూంటే బంగెనపల్లి మామిడిపళ్ళ రసం చప్పరిస్తున్నట్టుంది శ్రీహరిరావుకు.

"సరే... పదండి" హుశారుగా బయటకొచ్చి ఆటో కోసం కేకేశాడు.

ఆంధ్రుల రాజధాని అందచందాలను కజిన్‌బ్రదర్ కొడుకు నోట వింటూ 'అబ్బో! మావాడికి చాలా విషయాలు తెలుసే' అనుకున్నాడు.

హోటల్ సిద్దార్థ ముందాగింది ఆటో. కన్ను మూసి తెరిచేలోగా కొంటె జంట హోటల్‌గేటు దాటింది.

ఆటో చార్జీలిచ్చి అర్జంటుగా పరుగెత్తాల్సి వచ్చింది.

ఇడ్లీ, దోసె, కాఫీ... ఆహా! నలభీమ పాకమంటే ఇదే. రుచికి రుచి, శుచికి శుచి, తోడుగా కమ్మని కబుర్లు. ఆహ్లాదంగా ఉంది.

చేతులు కడుక్కునేలోగా జంట కౌంటర్ దాటింది. బిల్లు శ్రీహరిరావు చేతికొచ్చింది.

వామ్మో! ముష్టి మూడు టిఫిన్లకు వంద ఇరవై రూపాయలా? బుర్ర గిర్రుమంది.

బయటికొచ్చాక "రామకృష్ణా థియేటరెక్కడుందో గానీ అందులో సిన్మా చూడాలనుందిరా. అక్కడికి తీసుకెళ్లా శ్రీధరం" ఆదేశం వెలువడింది.

" ఆ సంగతి నాకొదిలెయ్ బాబాయ్. రామకృష్ణా థియేటర్‌కు నేను తీసుకెళ్తా గదా" శ్రీధర్ భరోసా.

హమ్మయ్య... ముందే కమిటైపోయాడు వెధవ. అసలీ శ్రీహరిరావంటే చిత్తు కాయితమనుకున్నాడేమో! నాలుగడుగుల్లో చౌరస్తా. అక్కడ ఎక్కిస్తాడు ఆటో. లోలోపల విజయగర్వం.

ఎడాపెడా రెండు నిమిషాలు నడిచి ఎడమవైపు తిరగ్గానే రామకృష్ణా థియేటర్ కనపడింది.

అరె! ఇంత దగ్గరుందనుకోలేదు...

రామప్ప నాట్య సుందరుల శిల్పాలు, తీర్చిదిద్దిన రంగుల బొమ్మలు...ఆహా! కళామతల్లికి కైమోడ్పులర్పిస్తుందీ థియేటర్.

బుకింగ్ కౌంటర్లముందు బారులు తీరిన జనాలు. వివిధ సాంప్రదాయాల దుస్తుల్లో సీతాకొక చిలుకల్లాగున్నారు. ఓహ్! నగరం నడిబొడ్డున మినీ భారతదేశం. అవ్యక్తానందం నరాల్లో గంతులేసింది.

ఎవరో ఫ్రెండుతో మాట్లాడుతున్నాడు శ్రీధర్.

"అమ్మాయ్! టికెట్ల కోసం లైన్‌లో నుంచోవాలి కదా!" గుర్తుచేశాడు శ్రీహరిరావే.

"ఆడాళ్ళ లైను హన్మంతుని తోకలా ఉంది. మీరు నుంచోండి మామయ్యా మగాళ్ళ లైన్లో!"

"మరి డబ్బులియ్యమ్మా" అని అడగాలన్పించింది. కాని మాటలు గొంతులో ఆగిపోయాయి.

డబ్బులడిగితే పిసినారి అనుకుంటారు. అడక్కపోతే పర్స్ ఖాళీ అయిపోతుంది. కాని డబ్బు దగ్గర మొహమాటమడితే జీవితమంతా డబ్బా వాయించాల్సిందే. జ్ఞానోదయమయ్యేప్పటికి

కిటికీ ముందున్నాడు. అటూ ఇటూ చూస్తే శ్రీధర్ కనపడలేదు. పర్సులో పడుకున్న వంద కాయితానికి రెక్కలొచ్చి ఎగిరి పోయింది. టికెట్లూ, చిల్లర డబ్బులు చేతిలో వాలాయి.

సినిమా చూసి బయటకొచ్చేసరికి కడుపులో ఎలుకలు పరిగెత్తుతున్నాయి.

"పదండి బాబాయ్,ఇంటికెళ్ళగానే మీ కోడలు వంటచేస్తుంది" అన్నాడు శ్రీధర్.

అమ్మోయ్ ! టైం రెండైంది. ఇంటికెళ్ళి వంటయ్యేసరికి మరో రెండు గంటలు. ముందే అల్సర్ జబ్బు. భోజనమాలస్యమైతే కడుపులో మంట. పేగులు మాడిపోవడం ఖాయం.

"ఈ పూట హోటల్లో భోంచేద్దాంరా శ్రీధరం" అంటూ దారి తీసాడు.

"దానికో నూట యాభై దండగ బాబాయ్" అంటూనే వెంబడించాడు.

"పాపం! మామయ్యను హోటల్ సిద్ధార్థ భోజనం రుచి చూడనివ్వండీ"

మాటల్లోనే హోటల్ సిద్ధార్థ ముందుకొచ్చేశారు.

"ఓరేయ్ త్యాగీ! బాగున్నావా?" హోటల్ నుండి బయటికొస్తున్న యువకుని భుజమ్మీద చెయ్యేసి ఆపేశాడు శ్రీధర్. "మీరు నడవండి. నాకు సీటు ఉంచండి" పురమాయింపు గూడాను.

చచ్చినట్టు మీల్స్ టికెట్లు కొనాల్సి వచ్చింది. టేబుల్ ముందుకొచ్చేసరికి శ్రీధర్ వచ్చేశాడు.

"వాడు నా క్లాస్‌మేటు బాబాయ్. ఏ.జీ.లో పంజేస్తున్నాడట" చెబుతూ కూచున్నాడు.

ఆహా! కూరలు ఫైన్. పచ్చళ్ళు వెరీఫైన్. గడ్డపెరుగూ... పాయసం... షడ్రసోపేత భోజనమంటే ఇదే. దీని కెంత డబ్బిచ్చినా తక్కువే... శ్రీహరిరావు ఆనందం.

ఇంటికి చేరుకుని నడుం వాల్చేసరికి మూడు దాటింది. గదిలోని మాటలు రెక్కలు కట్టుకొని బయటికొస్తున్నాయి.

"మీ బాబాయ్‌కి బాగానే ఖర్చైందండీ!"

"ఔను సుకన్యా! ఇహ ఆయన జేబు నుండి ఏమీ ఖర్చు కాకుండా చూడాలి. నేనంటే మా బాబాయ్ కెంత ప్రేమ. చూస్తున్నావు కదా అప్పట్నుంచీ..."

"నిజమేనండీ. మామయ్య చాలా మంచివారు"

మాటలు కావవి. మాణిక్యాల మూటలు. ఇటు నవ్వు తోసుకొస్తుంటే అటు కనురెప్పలు బరువెక్కి మూతలు పడుతున్నాయి.

నిద్రలేచే సరికి నాలుగైంది.

"మొహం కడుక్కోండి మామయ్యా కాఫీ తెస్తాను"

మొహం కడుక్కునేసరికి ప్రాణం తేలికైంది. కడుపులోకి జారుతున్న కాఫీ నరాలకు కొత్త ఉత్సాహాన్నిస్తుంది.

"చెప్పండి బాబాయ్. ఇప్పుడెటు వెళ్దాం?"

"సాలార్‌జంగ్ మ్యూజియం చూడాలనుందిరా?"

"సరే... పదండి"

సాలార్‌జంగ్ మ్యూజియం ముందు ఆటో దిగుతూ "డబ్బులు మీరివ్వద్దు మామయ్యా!' అంది సుకన్య.

వెన్నుపూసకు వెన్న రాసినట్టనిపించింది శ్రీహరిరావుకు.

జేబులన్నీ వెతుక్కుని "ఆ! పర్సు నువ్వు తెచ్చావు గదూ! ఆటో డబ్బులివ్వు సుకన్యా!" పురమాయించాడు శ్రీధర్.

"లేదండీ. పర్స్ నేను తేలేదు. మీరే తెస్తారనుకున్నాను"

"అదెట్లా? నువే హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకొస్తావనుకొన్నాను. ఛీఛీ! ఇదేం బాగాలేదు సుకన్యా'

" మీ నిర్వాకమే బాగుందా..." రెచ్చిపోయింది.

"పైసలివ్వండి సాబ్..." ఆటోవాలా గుర్రుమన్నాడు.

శ్రీహరిరావు పర్సు నోరు విప్పక తప్పలేదు. మ్యూజియం టికెట్లూ, మధ్యలో కాఫీలు, రాత్రి హోటల్ భోజనం, ఇంటి దాకా ఆటో... ఖర్చు తడిసిమోపెడైంది. వారం రోజుల ఖర్చు కోసం తెచ్చిన డబ్బు పన్నెండు గంటల్లో పరారైంది. మిగిలింది బస్‌ఛార్జీలే.

ఇంటికెళ్ళగానే అడిగాడు శ్రీధర్.

"రేపటి ప్రోగ్రాం చెప్పండి బాబాయ్. కావాలంటే ఆఫీసుకు సెలవు పెడ్తాను"

"నేనీ రాత్రి బండికే వెళ్ళాలిరా" శ్రీహరిరావు చేతిలో సూటుకేసు.

"అదెలా బాబాయ్! వారం రోజులన్నా..." నోరు బారెడు తెరుచుకుంది.

హన్నా! వారం రోజులుంటే చేతి ఉంగరాలు, మెడలోని బంగారు గొలుసు అమ్మించేట్టుంది.

"నాకిప్పుడే గుర్తుకొచ్చిందిరా... రేపు నా ప్రాణస్నేహితుని కూతురు పెళ్ళి... వస్తానమ్మా!'

"అన్నట్టూ... మా బాబాయ్, పిన్నితోసహా వస్తానని రాశాడు. ఆయన మీ ఫ్రెండే కదా. మీ ఊరే గదా! తప్పక రమ్మని చెప్పండి మామయ్యా!"

"ఇక్కడ నా అనుభవాలన్నీ చెప్తాను. ఆ తర్వాత వాళ్ళిష్టం తల్లీ."

జవాబు కూడా ఆశించకుండా జారుకున్నాడు.

"హబ్బా! పానకంలో పుడకనుకున్నానండీ... మీ నటన సూపర్‌హిట్..." సుకన్యకు నవ్వాగలేదు.

"పుడకల్ని పాయసంగా మార్చి పానకంలో నంజుకోవడం వినా నగరాల్లోని చిరుద్యోగులకు గత్యంతరం లేదు డియర్!"

బాధగా మూల్గాడు శ్రీధర్.

**ఆంధ్రభూమి దినపత్రిక, 17 ఆగష్టు 1997.**